గ్యాస్ ధరల బాదుడు



- ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెంపు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- నియోజకవర్గంలో 60 వేల గ్యాస్ కనెక్షన్లు


సిలండర్లను వాహనంలో తరలిస్తున్న దృశ్యం

గుడిబండ: సామాన్యుల పాలిట గ్యాస్‌బండ గుదిబండలా మారింది. ఒక్కో వంట గ్యాస్ సిలిండర్ కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వం మరో రూ.50 పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విపరీతంగా పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతుంటే తాజాగా గ్యాస్ ధరల పెంపు ఉక్కిరిబిక్కిరి చేస్తోందని మండిపడుతున్నారు. పట్టణాలు, పల్లె, గిరిజన ప్రాంతాల్లోనూ ప్రస్తుతం గ్యాస్ వినియోగం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలు గ్యాస్ భారం తప్పక మోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికలకు ముందు స్వల్పంగా గ్యాస్ ధరలు తగ్గించిన మోదీ ప్రభుత్వం.. ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమని విమర్శిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని టీడీపీ నాయకులు ఎన్నికలకు ముందు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. గద్దెనెక్కిన ఏడాది కేవలం ఒకటే ఒక సిలిండర్ ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. అంతేకాకుండా డబ్బులు ఇచ్చి గ్యాస్ సిలిండర్ తీసుకుంటున్న వారిలో ప్రభుత్వం ఎవరికి డబ్బులు వేస్తుందో.. ఎవరికి వేయడం లేదో అంతా అయోమయంగా మారింది. కేంద్రంలోని మోదీ సర్కారు.. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం.. ప్రజలను మోసగించిడానికే ఉన్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అదనపు భారం

మడకశిర నియోజకవర్గంలోని గుడిబండ, అమరాపురం, రొళ్ల, మడకశిర రూరల్, అగళి మండలాల్లో 60 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నెలకు సగటున 1.10 లక్షల గ్యాస్‌బండలను వినియోగిస్తున్నారు. తాజాగా రూ.50 ధర పెంపుతో నియోజకవర్గంలోని గ్యాస్ వినియోగదారులపై మొత్తం రూ.50 లక్షల మేర అదనపు భారం పడుతోంది.

ఆన్‌లైన్ బుకింగ్‌లో అవస్థలు

గతంలో గ్యాస్ సిలిండర్ తీసుకునే లబ్ధిదారులు నేరుగా గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి తమ వద్ద ఉన్న గ్యాస్ పుస్తకాల ఆధారంగా డబ్బు చెల్లిస్తే గ్యాస్ బండలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేయాల్సి వస్తోంది. ఈ విధానం వల్ల చాలా మందికి తెలియకపోవడం, వినియోగదారుల వద్ద ఫోన్లు లేకపోవడంతో గ్యాస్ సిలిండర్లను సకాలంలో పొందలేకపోతున్నారు. ఇంకోవైపు ఈ-కేవైసీ చేసిన గ్యాస్ ఏజెన్సీలు తప్పుల తడకలతో ఒకరి ఫోన్ నంబర్ ఇంకొకరికి అనుసంధానం చేయడంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా వినియోదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇలా అయితే కష్టమే..



గ్యాస్ ధరల భారం ఇక మోయలేం. ప్రతిసారి పెంచేస్తున్నారు. గతంలో కట్టెల పొయ్యిలు వాడేవాళ్లం. అప్పట్లో అది మంచిది కాదు.. అంటూ గ్యాస్ వినియోగించాలని తక్కువ ధరకు గ్యాస్ సిలండర్ ఇచ్చి ప్రోత్సహించారు. ఇప్పుడు గ్యాస్ అలవాటు అయిన తర్వాత ధరలు పెంచేస్తున్నారు. ఇలా అయితే కష్టమే. – విమలమ్మ, గృహిణి, ఫళారం

ధరల భారం మోయలేం



ప్రభుత్వమే గ్యాస్ బండల ధరలు నియంత్రించాలి. ఇలా ఆరు నెలలు, ఏడాదికి రూ.50 చొప్పున పెంచుకుంటూ పోతే ఇబ్బందులు తప్పవు. నెలకు మాకు రెండు గ్యాస్ బండలు అవసరం అవుతున్నాయి. రూ.100 అదనపు భారం మోయాల్సి వస్తోంది. – రామక్క, గృహిణి, గుడిబండ

ధరలను తగ్గించాలి



ఇప్పటికే నిత్యావస ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిలిండర్ ధరను రూ.50 పెంచి పేద, మధ్య తరగతి వర్గాలపై భారం మోపడం సరికాదు. పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి. – డీఎల్ యంజారేగౌడ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

క్లుప్తంగా

మునిస్వామికి డాక్టరేట్



పావగడ: తాలూకాలోని మద్దె గ్రామానికి చెందిన గాజుల కొండప్ప, చెన్నమ్మ దంపతుల కుమారుడు బీకే మునిస్వామి పీహెచ్‌డీ పట్టా పొందారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో ఉన్న మానసరోవర గ్లోబల్ యూనివర్సిటీలో డా.విజేంద్ర మిశ్రా మార్గదర్శనంలో 'ఎక్స్‌ప్లోరింగ్ యాస్పెక్ట్స్‌అండ్ డిటర్మినంట్స్ ఆఫ్ ఇంటర్‌జనరేషనల్ మొబిలిటి ఇన్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా పొందడంతో అతడిని పలువురు ప్రశంసించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగిరెడ్డి (బుల్లెట్) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే హిందూపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్, స్థానిక నాయకులు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

క్రీడల్లోనూ రాణించాలి


అభినందిస్తున్న ఎంఈఓ అంజనేయులునాయక్

సోమందేపల్లి: దివ్యాంగ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ అంజనేయులునాయక్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థి గౌరీ శంకర్ అనే దివ్యాంగ విద్యార్థి ఈ నెల 23న ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీల్లో తృతీయ బహుమతి సాధించాడు. దీంతో స్థానిక ఎమార్సీలో శుక్రవారం ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

హిందూపురం టౌన్: సీపీఎం కాలనీలో ఇల్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా సభ్యుడు జెడ్పీ శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, పట్టాలు ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. దీనిపై కోర్టు ఆదేశించినా అధికారులు స్పందించడం లేదన్నారు. న్యాయం జరగకపోతే పేదలందరితో కలిసి పెద్దఎత్తున పోరాటాలను చేస్తామన్నారు. దీక్షల్లో సీపీఎం, కేవీపీఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: ఇళ్లు లేని పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కొడికొండ చెక్‌పోస్టు సమీపంలోని 44 వ నెంబరు జాతీయ రహదారి పక్కన గుడెసెలు వేసుకొన్న చోటే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, రామచంద్ర, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద ఉత్సవం


విసర్రాయి తిప్పుతూ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక వైఈ రంగయ్య శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జానపద ఉత్సవంలో గ్రామీణ సంస్కృతి వెల్లివిరిసింది. ఈ సందర్భంగా జానపద రచయిత సణ్ణ నాగప్ప మాట్లాడుతూ.. కాలక్రమేణ అంతరించి పోతున్న జానపద సంస్కృతి, కళలను కాపాడేందుకు నేటి యువత కృషి చేయాలన్నారు. అంతకు ముందు ముఖ్య అతిథులు జానపద కవి సణ్ణ నాగప్ప, ప్రిన్సిపాల్ డా.ఎస్ శ్రీధర్‌ను చళ్లికెరె క్రాస్ నుంచి ఎద్దుల బండిలో జానపద ఊరేగింపుతో కళాశాలకు తీసుకెళ్లారు. కళాశాల ఆవరణలో రాగి, వరి, గోధుమలు తదితర చిరు ధాన్యాలను అలంకరించి ధాన్య పూజ చేశారు. అనంతరం పాలు పోసే పండుగ, మారెమ్మ ఉత్సవం, గౌరి పూజ తదితర గ్రామీణ ఆచారాలను నిర్వహించడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు


అమరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: మండలంలోని భూమి ఉన్న ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి. పంటలను సాగు చేసి ఆదాయం పొందాలని ప్రకృతి వ్యయసాయం డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, సర్పంచ్ అంజినమ్మ తెలిపారు. శుక్రవారం ఆర్.అనంతపురం పంచాయతీలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం ద్వారా కలిగే అనర్థాలు, సేంద్రియ వ్యవసాయం ద్వారా కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సాగు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని గుర్తు చేశారు. అదే విధంగా ఏటీఎం, ఏ-గ్రేడ్ మోడల్ ద్వారా పంటల సాగు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ లక్ష్మీతేజ, ఐసీఆర్పీలు, డీఎంఎంటీఎస్, ఉత్తమ రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురంలో ర్యాలీ..

అమరాపురం: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని అధికారులు నారాయణ, దేవీరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రామైక్య సంఘం కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు తమ పెరటిలో ప్రకృతి వ్యవసాయంలో పండించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, అరటి తదితర వాటిని సాగు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలని ధర్నా


నీటి సౌకర్యం కల్పించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానిక తహసీల్దార్ కార్యలయం ఎదుట జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. పాలసముద్రం క్రాస్ సమీపంలో నివాసం ఉంటున్న పేదల గుడిసెలకు వెంటనే నీటి సౌకర్యం కల్పించాలని, వారికి హైకోర్టు ఆదేశాల మేరకు నివాస హక్కులను కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పెద్దన్న డిమాండ్ చేశారు. గుడిసెల్లో నివాసం ఉన్న వారి సమస్యలు పరిష్కరించాలని ఏడాది కాలంగా అధికారులను మొరపెట్టుకున్నా పెడచెవిన పెడుతున్నట్లు ఆయన ఆరోపించారు. పేదలు హైకోర్టును ఆశ్రయిస్తే పేదలకు నివాస హక్కులు కల్పించి, వసతులు కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. తహసీల్దార్ మారుతీప్రసాద్ అందుబాటులో లేకపోవడంతో కార్మిక సంఘం నాయకులు ఫోన్‌లో సమస్యను తెలియజేశారు. స్పందించిన ఆయన.. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తహసీల్దార్ హామీ మేరకు పేదలు ధర్నా విరమించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముత్యాలప్ప, కొండ వెంకటేశులు నాగభూషణం, లక్ష్మీదేవి, అచ్చమ్మ, అంజనాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

హిందూపురం టౌన్: కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ ఆఫ్రిద్, కో కన్వీనర్ అజ్మల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణంలోనే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే ముందుగానే ప్రైవేట్ పాఠశాలల నిర్వహకులు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తూ దోచుకుంటున్నారన్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బిలాల్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

దుక్కిలో విత్తనాలు చల్లితే ప్రయోజనం


రాగి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏడీఏ

లేపాక్షి: వర్షా కాలం ముందు పొడి విత్తనాలు దుక్కిలో చల్లడం ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయని డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా సూచించారు. శుక్రవారం ఉదయం మండలంలోని చోళసముద్రంలో రైతు గంగరత్మమ్మ పొలంలో ప్రీ మాన్సూన్ డ్రై షోయింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ దుక్కిలో ఐదు రకాల ప్రధాన పంటలతో పాటు 20 రకాల వివిధ పంటల గింజలను కలిపి చల్లాలన్నారు. తొలకరి వర్షం కురిసిన వెంటనే విత్తనాలు మొలకెత్తడంతోపాటు సూక్ష్మజీవులు సంఖ్య పెరగటం, నేలలో తేమ వుండటం, నేల ఆరోగ్యంగా ఉండటం, రైతుకు ఆదాయంగా ఉంటుందన్నారు. అనంతరం ఆమె మండల కేంద్రంలో రాగులు కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. క్వింటా రాగులకు రూ.4290లు మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అలాగే నాగానపల్లిలో భూసార ఆధారిత ఎరువుల వాడకం పథకం కింద మట్టి నమూనాల సేకరణ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓ పుష్పలత, ఆర్‌యస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.


విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

హిందూపురం టౌన్: 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈఈ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఆర్‌టీసీ కాలనీ, త్యాగరాజ్‌నగర్, చైతన్యనగర్, శాంతినగర్, కోర్ట్ ఏరియా, పెనుకొండ రోడ్డు, ఆబాద్ పేట, ముక్కడిపేట, ధర్మపురం, మున్సిపల్ కార్యాలయం ఏరియాలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

10న మెగా లోక్ అదాలత్

హిందూపురం అర్బన్: ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మే 10న మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ శుక్రవారం తెలిపారు. రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. చెక్‌బౌన్స్, భూ తగాదాలు, బ్యాంక్ రుణాలు, మున్సిపాలిటీ, ఎక్సైజ్ కేసులతో పాటు రాజీకాదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. మే 10న ఉదయం 11 గంటలకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ జరుగుందని కక్షదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లక్ష్మీదేవిగా నల్లరాళ్ల గంగమ్మ



పావగడ: నల్లరాళ్ల గంగమ్మ, ఏడుగురు అక్కమ్మ గార్ల జాతర కొనసాగుతోంది. శుక్రవారం నల్లరాళ్ల గంగమ్మ దేవత లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, గంగా సహస్రనామం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సింధు భైరవి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం

మడకశిర: పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో 200 ట్రాన్స్ ఫార్మర్లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఈ భూపతి, డీఈ రఘు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో కోళ్ల కళేబరాలు



పెనుకొండ రూరల్: మండలంలోని అడదాకులపల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువలో కోళ్లను పడేయడం చర్చనీయాంశమైంది. ఇటీవల తెగుళ్లు వచ్చి కోళ్లు చనిపోతుండడంతో కోడి మాంసం విక్రయాలు కూడా తగ్గిపోయాయి. దీనికి తోడు కోళ్లు కొనుగోలు చేసేవారు కూడా తగ్గిపోయారు. దీంతో మృతిచెందిన కోళ్లను ఫారం నిర్వాహకులు హంద్రీనీవా కాలువలో పడేసి ఉంటారని శుక్రవారం సాయంత్రం సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది.

అసలు దొంగల కోసం ముమ్మర గాలింపు

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమలో ఇంజిన్లు చోరీకి గురైన కేసులో అసలు దొంగల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. కియా పరిశ్రమలో ఇంజిన్లు చోరీకి గురైన కేసులో తమిళనాడుకు చెందిన ఎనిమిది మందిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. అయితే అసలు దొంగల కోసం పోలీసులు తీవ్రంగా ప్రయత్నం సాగిస్తున్నారు. శుక్రవారం కూడా తమిళనాడు, ఢిల్లీ ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లినట్లు సమాచారం.

మలేరియా నివారణకు సమష్టి కృషి


బేవనహళ్లిలో ప్రచారం చేస్తున్న వైద్య సిబ్బంది


అగళిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హిందూపురం/హిందూపురం టౌన్: మలేరియా వ్యాధి నివారణకు సమష్టిగా చర్యలు చేపట్టాలని బేవనహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పద్మాజ, మంజునాథ అన్నారు. జాతీయ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బేవనహళ్లిలో మలేరియా ఇతర వ్యాధుల నియంత్రణ అవగాహణ ర్యాలీ చేపట్టారు. వైద్యులు మాట్లాడుతూ దోమల కాటు వల్ల మలేరియా, డెంగీ వంటి జ్వరాలు సోకుతామన్నారు. వ్యాధులను నియంత్రించడానికి ఇంటి పరిసరాల్లో నీటికుంటలు, డిబ్బలు లేకుండా చూసుకోవాలన్నారు. రాత్రి పూట దోమతెరలు వినియోగించాలన్నారు. అలాగే లక్ష్మీపురం అర్బన్ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ వైద్యాధికారిణి డాక్టర్ అయిషా తస్నీమ్ ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవం నిర్వహించారు.

లేపాక్షిలో ర్యాలీ

లేపాక్షి: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకట చిరంజీవి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. అలాగే మలేరియా వల్ల కలిగే నష్టాలు, నిర్మూలన చర్యలు, పరిసరాల పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సీతామహలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఆరోగ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

అగళి: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. దోమలతో వ్యాధులు సోకుతాయని తెలిపారు. అత్యధిక మరణాలు దోమల ద్వారానే సంభవిస్తునట్లు పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించి దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరసరెడ్డి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

సోమందేపల్లి: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని సోమందేపల్లి వైద్యుడు ఓంకార్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమందేపల్లిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం: రొద్దం మండల కేంద్రంలో డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి ప్రధాన వీధిల్లో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ చేశారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, బోధకాలు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ భాగ్యలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయం


హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న క్రైస్తవులు

హిందూపురం టౌన్: జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గామ్ సమీపంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని పాస్టర్లు, నాయకులు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఉగ్రదాడిని ఖండిస్తూ క్రైస్తవుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి, హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, స్టీఫెన్ రాజ్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, దేవరాజ్, జేమ్స్, సాల్మన్ రాజ్, దేవరాజ్ ఆంజనేయులు, డేవిడ్, డ్యానియల్ తదితరులు పాల్గొన్నారు.

పావగడ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం లోయ అందాలను వీక్షించేందుకు వచ్చిన 27 మంది పర్యాటకులను పాకిస్తాన్ ఉగ్రవాదులు విచక్షణా రహితంగా తుపాకి గుళ్లు కురిపించి హత్య చేయడం దుర్మార్గపు చర్య అని స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప తీవ్రంగా ఖండించారు. శుక్రవారం తాలూకా కార్యాలయం ఎదుట వివిధ రైతు సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అనంతరం గ్రేడ్-2 తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు శివు, కార్యదర్శి రమేశ్, మృత్యుంజయ, రొప్పం మరజాన్, గోవిందప్ప, కృష్ణమూర్తి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి సన్మానం


జడ్జి దంపతులను సన్మానిస్తున్న న్యాయవాదులు

పెనుకొండ రూరల్: పెనుకొండ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ దంపతులను న్యాయవాదులు సన్మానించారు. ఈయన పుట్టపర్తి కోర్టుకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం స్థానిక పెనుకొండ న్యాయవాదులు జడ్జి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, గౌతమి, జావిద్, బాలాజీ, హరి, నాగిరెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.